ప్రమాదకరంగా రహదారులు

- గుంతలమయంగా మారి చోటుచేసుకుంటున్న ప్రమాదాలు
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

ఆత్మకూరు (ఎస్) : మండలం పరిధిలోని పలు గ్రామాలను అనుసంధానిస్తూ ఏర్పాటు చేసిన రహదారులు గుంతలమయంగా మారాయి. ఆయా గ్రామాలకు వేసిన ఆర్‌అండ్‌బీ రహదారుల పనుల్లో నాణ్యత లేకపోవడం కారణంగా వేసిన కొన్నాళ్లకే గుంతలు పడుతున్నాయి. ఈ గుంతల దారుల కారణంగా తరచుగా ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. అయినప్పటికీ అధికారులు గుంతలను పూడ్చడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు.

పట్టించుకోని అధికారులు..

సూర్యాపేట–దంతాలపల్లి ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారి ఆత్మకూరు మండలంలోని నెమ్మికల్ నుంచి పాతర్లపహాడ్ స్టేజీ వరకు అధ్వానంగా తయారైంది. దాదాపు నాలుగు కిలోమీటర్ల దూరం ఉండే ఈ ప్రాంతంలో రోడ్డంతా గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారాయి. గత ఏడాది ఈ రహదారికి మరమ్మతులు చేపట్టగా పనుల్లో నాణ్యత లోపించి మళ్లీ గుంతలు ఏర్పడ్డాయి. దీంతో ప్రజలు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల ఈ రహదారిపై గుంతను తప్పించబోయి నెమ్మికల్ శివారులో ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందింది. అలాగే తుమ్మలపెన్‌పహాడ్ గ్రామం నుంచి కోటపహాడ్ వరకు వెళ్లే రహదారి గుంతలమయంగా మారి ప్రయాణం ఇబ్బందికరంగా మారింది. వెంటనే అధికారులు స్పందించి రోడ్ల మరమ్మతులు చేపట్టాలని ప్రయాణికులు, మండల ప్రజలు కోరుతున్నారు.


కోటపహాడ్ - తుమ్మలపెన్‌పహాడ్ రోడ్డుపై ఏర్పడిన గుంతలు

మరమ్మతులు చేపట్టాలి



మండలంలోని నెమ్మికల్ నుంచి పాతర్లపహాడ్ వరకు, అలాగే తుమ్మలపెన్ పహాడ్ నుంచి కోటపహాడ్ వరకు ఉన్న రహదారులు గుంతలమయంగా మారాయి. ప్రయాణికులకు ఇబ్బందిగా ఉన్నప్పటికీ అధికారులు స్పందించడం లేదు. వెంటనే రహదారులకు మరమ్మతులు చేపట్టాలి.

– అవిరె అప్పయ్య

నాణ్యత లోపం.. నడిరోడ్డుపై గుంత

దురాజ్‌పల్లి : సూర్యాపేట పట్టణంలో ఇటీవల ఎన్నికలకు ముందు హడావుడిగా వేసిన రోడ్ల నాణ్యత లోపించింది అనడానికి నిదర్శనమే ఈ దృశ్యం. ప్రజలు అనుమానిస్తున్నట్లు గానే రోడ్డు నిర్మాణం నాణ్యత లేదని అర్థం అవుతోంది. పట్టణంలో రోడ్డు వెడల్పులో భాగంగా ఎస్వీ డిగ్రీ కళాశాల నుంచి జాతీయ రహదారి వరకు నూతన రోడ్లను నిర్మిస్తున్నారు. అయితే ఒక పక్క పనులు జరుగుతుండగానే మరో పక్క పోస్టాఫీస్ వద్ద రోడ్డుపై పెద్ద గుంత ఏర్పడింది. ఇక్కడ ఎలాంటి డ్రెయినేజీ లేకున్నా నడి రోడ్డపై ఇంత పెద్ద గుంత ఏర్పాడటం నాణ్యత లోపమని స్పష్టం అర్థం అవుతోందని స్థానికులు అనుకుంటున్నారు.


సూర్యాపేట పట్టణంలో పోస్టాఫీస్ ఎదురుగా రోడ్డుపై ఏర్పడిన గుంత

గ్యారంటీలను తప్పకుండా అమలుచేస్తాం

- తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే సామేల్

అర్వపల్లి : ఆరు గ్యారంటీలను తప్పకుండా అమలు చేస్తామని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అన్ని ప్రభుత్వ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించి మాట్లాడారు. గోదావరి జలాలను వెంటనే విడుదల చేసేలా ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. రహదారులు, విద్య, వైద్య రంగాల్లో సమస్యలు లేకుండా చూడాలని అన్నారు. మిషన్ భగీరథ నీళ్లు అన్ని గ్రామాలకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గత ప్రభుత్వం కొత్తగూడెం, బొల్లంపల్లి, వేల్పుచెర్ల తదితర గ్రామాలకు ఇంతవరకు బీటీరోడ్లు నిర్మించక పోవడం సిగ్గుచేటన్నారు. ఈ విషయమై ఆయా శాఖల సీఈలు, ఎస్ఈలతో ఫోన్‌లో మాట్లాడారు. ఆయా గ్రామాలను వెంటనే సందర్శించి బీటీ రోడ్ల నిర్మాణం జరిగేలా చూడాలని అధికారులకు సూచించారు. గోదావరి జలాల విడుదల విషయమై బుధవారం ఈఎన్‌సీ స్థాయిలో సమావేశం జరుగుతుందని ఆ సమావేశంలో తగిన నిర్ణయం తీసుకుంటారని చెప్పారు. తిమ్మాపురం–సంగెం బీటీ రోడ్డు విస్తరణకు నిధుల మంజూరు కోసం ప్రయత్నిస్తానని తెలిపారు. కాగా అర్వపల్లి–జాజిరెడ్డిగూడెం విద్యుత్ ఫీడర్‌ను వేరుచేసి అర్వపల్లిటౌన్‌కు విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూడాలని జెడ్పీటీసీ దావుల వీరప్రసాద్‌యాదవ్ ఎమ్మెల్యేకు విన్నవించగా.. ఈ సమస్యను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని డిస్కం డీఈఈని ఎమ్మెల్యే సామేల్ ఆదేశించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల ఉద్యోగులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఎంపీపీ మన్నె రేణుకాలక్ష్మీనర్సయ్యయాదవ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జెడ్పీటీసీ దావుల వీరప్రసాద్‌యాదవ్, డీఆర్‌డీఓ ఎస్.కిరణ్‌కుమార్, పీఏసీఎస్ చైర్మన్ కుంట్ల సురేందర్‌రెడ్డి, ఎంపీడీఓ కె.ఉమేష్, తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాసులు, ఎంపీఓ సందీప్‌కుమార్, సీనియర్, జూనియర్ అసిస్టెంట్‌లు నర్సింహరాజు పాల్గొన్నారు.

మురుగు నిలుస్తున్న పొలాల పరిశీలన

పొలాల్లో మురుగు నీరు ఆగకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే మందుల సామేల్ సంబంధిత సిబ్బందికి సూచించారు. శుక్రవారం జాజిరెడ్డిగూడెం శివారులో మురుగునీరు చేరుతున్న వ్యవసాయ భూములను ఆయన పరిశీలించి మాట్లాడారు. ఈ విషయమై జిల్లా అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మన్నె రేణుకాలక్ష్మీనర్సయ్యయాదవ్, ఎంపీడీఓ ఉమేష్, డీసీసీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు చెవిటి వెంకన్న, దరూరి యోగానందచారి, మోరపాక సత్యం, నర్సింగ నాగమ్మశ్రీనివాస్‌గౌడ్, శిగ నసీర్‌గౌడ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

కోమటిరెడ్డికి సన్మానం


మంత్రి వెంకట్‌రెడ్డితో కాంగ్రెస్ నాయకులు

తిరుమలగిరి : తెలంగాణ రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన నల్లగొండ శాసన సభ్యుడు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని తిరుమలగిరి మండల కాంగ్రెస్ నాయకులు శుక్రవారం హైదరాబాద్‌లోని మంత్రి నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి, సన్మానించారు. ఈ కార్యక్రమంలో చింతరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, సంకెపల్లి కొండల్‌రెడ్డి, సుంకరి జనార్దన్, తిరుమని యాదగిరి, బత్తుల శ్రీను, కందుకూరి లక్ష్మయ్య, రాము గౌడ్, రాజిరెడ్డి, ఖలీమ్, సలీమ్, పున్నమ్ తదితరులు పాల్గొన్నారు.

భువనగిరి ఎంపీ టికెట్ చెవిటి వెంకన్నకు ఇవ్వాలి

తుంగతుర్తి : భువనగిరి పార్లమెంట్ టికెట్‌ను బీసీ యాదవ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి చెవిటి వెంకన్నయాదవ్‌కు ఇవ్వాలని భారత యాదవ సమితి జిల్లా అధ్యక్షుడు నన్నెబోయిన సుధాకర్‌యాదవ్ అన్నారు. శుక్రవారం రావులపల్లిలో విలేకరులతో మాట్లాడారు. చెవిటి వెంకన్నయాదవ్ దశాబ్దాల కాలంగా ప్రజా సమస్యలపై పోరాడుతున్నాడని తెలిపారు. కార్యక్రమంలో బీవైఎస్ జిల్లా యూత్ అధ్యక్షుడు చిన్నికృష్ణ, మల్లేష్, మల్లయ్య, వెంకటేష్, నాగరాజు, శ్రీను, సుమన్ పాల్గొన్నారు.

మద్దిరాల : కాంగ్రెస్ పార్టీ భువనగిరి పార్లమెంట్ టికెట్‌ను చెవిటి వెంకన్న యాదవ్‌కు ఇవ్వాలని పాస్టర్ల సంఘం నియోజకవర్గ చైర్మన్ స్వామిదాసు యాదవ్ కాంగ్రెస్ అధిష్టానాన్ని కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమంలో వాసు, శంకర్, సుధాకర్, శివ పాల్గొన్నారు.

ఒలింపియాడ్‌లో ప్రతిభ


షణ్ముఖ ప్రత్యయ్


రంగ సుహాస్

సూర్యాపేటటౌన్ : రామానుజన్ గణిత అకాడమి – రామచంద్రపురం వారు నిర్వహించిన గణిత ఒలింపియాడ్ ఫైనల్ లెవల్‌లో జిల్లా కేంద్రంలోని జయ ఐఐటీ ఒలింపియాడ్ పాఠశాల నుంచి ఇద్దరు విద్యార్థులు జాతీయ స్థాయి ర్యాంకులు సాధించారు. శుక్రవారం జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా విద్యార్థులను ఆ పాఠశాల కరస్పాండెంట్ జయ వేణుగోపాల్ అభినందించారు. పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థి పిట్టల షణ్ముఖ ప్రత్యయ్ ఆల్ ఇండియా మొదటి ర్యాంకు, 9వ తరగతి నుంచి రంగ సుహాస్ ఆల్ ఇండియా రెండవ ర్యాంకు సాధించినట్లు తెలిపారు. విద్యార్థులను కరస్పాండెంట్‌తో పాటు డైరెక్టర్లు బింగి జ్యోతి, జెల్లా పద్మలు అభినందించారు.

ఎమ్మెల్యే సామేలుకు సన్మానం

అర్వపల్లి : అర్వపల్లిలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు చెవిటి వెంకన్నయాదవ్, దరూరి యోగానందచారి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి, నర్సింగ శ్రీనివాస్‌గౌడ్, మండల పార్టీ అధ్యక్షుడు మోరపాక సత్యం, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ, మండల అధ్యక్షులు వేల్పుల రమేష్, శిగ నసీర్‌గౌడ్, మాజీ జెడ్పీటీసీ కొరపెడిత అవిలయ్య పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్ తనిఖీ


మాట్లాడుతున్న డీఎస్పీ నాగభూషణం

మద్దిరాల : మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను డీఎస్పీ నాగభూషణం శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించి మాట్లాడారు. వార్షిక పర్యటనలో భాగంగా పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసినట్లు తెలిపారు. సిబ్బంది విధి నిర్వహణలో అలసత్వం వహించరాదని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ బ్రహ్మమురారి, ఎస్ఐ రవీందర్, ఏఎస్ఐ నాగయ్య, పోలీసులు పాల్గొన్నారు.

సస్పెండ్ చేయడం తగదు

తుంగతుర్తి : పార్లమెంట్‌లో ఇండియా కూటమి ఎంపీలను అక్రమంగా, అప్రజాస్వామికంగా సస్పెండ్‌చేయడం హేయమైన చర్యని కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు చింతకుంట్ల వెంకన్న, యూత్ కాంగ్రెస్ జిల్లా నాయకుడు పెద్దబోయిన అజయ్‌కుమార్ అన్నారు. కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ శుక్రవారం మండల కేంద్రంలో మెయిన్‌రోడ్డుపై నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ సోషల్ మీడియా స్టేట్ కోఆర్డినేటర్ కొండ రాజు, మద్దెల భిక్షం, కృష్ణ, అక్కినపల్లి నరేష్, ఎండీ అబ్దుల్, గణేష్, మావిడి నరేష్, షేక్ సిద్దిక్, మధు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పెద్దబోయిన అజయ్

నిరాధార ఆరోపణలు చేయడం సరికాదు


మాట్లాడుతున్న పెద్దిరెడ్డి గణేష్

భానుపురి : రాజకీయ, వ్యక్తిగత దురుద్దేశంతో పబ్లిక్ క్లబ్ కార్యవర్గంపై నిరాధార ఆరోపణ చేయడం మానుకోవాలని సూర్యాపేట పబ్లిక్ క్లబ్ కార్యదర్శి పెద్దిరెడ్డి గణేష్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని క్లబ్ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నిధుల విషయంలో ఎలాంటి తేడాలు ఉన్నా పూర్తి బాధ్యత కార్యవర్గం తీసుకుంటుందని, ఎలాంటి విచారణకైనా తాము సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. క్లబ్‌లో జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు మనం వికాస వేదిక ఆధ్వర్యంలో జరిగాయే తప్ప క్లబ్ నిధులను వినియోగించలేదన్నారు. 20 నెలల కాలంలో ఒక్క సభ్యత్వం కూడా ఇవ్వలేదని, ఇచ్చే ఉద్దేశం కూడా లేదని తెలిపారు. త్వరలోనే జనరల్ బాడీ సమావేశాన్ని నిర్వహించి లెక్కలన్నీ చార్టెడ్ అకౌంటెంట్ ద్వారా సర్టిఫైడ్ చేయిస్తామని తెలిపారు. ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికలు నిర్వహించాలని సూర్యాపేట ఆర్డీఓను కోరుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో క్లబ్ కార్యవర్గ ఉపాధ్యక్షుడు పిండం చంద్రశేఖర్, సంయుక్త కార్యదర్శి దాసరి శ్రీనివాస్, బోనగిరి భాస్కర్, సభ్యులు సునీల్ రెడ్డి, జయశంకర్, శ్రీనివాస్, వీరయ్య, తాహర్ పాషా, కిరణ్, సత్యనారాయణ పాల్గొన్నారు.

యువతకు అవగాహన కల్పించాలి

సూర్యాపేట క్రైం : మాదకద్రవ్యాలు, గంజాయి వినియోగం వల్ల కలిగే నష్టాలపై యువతకు అవగాహన కల్పించాలని ఆర్డీఓ బ్రహ్మచారి, డీఎస్పీ నాగభూషణం అన్నారు. నార్కోటిక్ పదార్థాల నిరోధక కమిటీ, జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీఓ కార్యాలయంలో శుక్రవారం సూర్యాపేట డివిజన్ స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గంజాయిని నిరోధించడంలో అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. గంజాయి, మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే నష్టాలను యువతకు, ప్రజలకు వివరించాలని సూచించారు. కార్యక్రమంలో సీఐలు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఎంఈఓలు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీఎస్పీ నాగభూషణం

కాలుష్య రక్కసి నుంచి కాపాడండి


వినతిప్రతం ఇస్తున్న నాగునాయక్

హైదరాబాద్ : సువెన్ ఫార్మాస్యూటికల్స్ లిమిటెడ్ కంపెనీ నుంచి వెలువడుతున్న విషవాయువులను పీల్చలేకపోతున్నామని, తమను కాలుష్య కోరల నుంచి కాపాడాలని గిరిజనులు శుక్రవారం హైదరాబాద్‌లోని ప్రజా భవన్‌లో నిర్వహిస్తున్న ప్రజావాణిలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా లంబాడా సంఘం సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు నాగునాయక్ మాట్లాడారు. ఎన్నో ఏళ్లుగా ఫ్యాక్టరీ నుంచి విడుదలవుతున్న విషవాయువులతో గాలి, నీరు, పచ్చని పొలాలు దెబ్బతింటున్నాయని తెలిపారు. ఎన్నికల ప్రచారంలో సీఎం రేవంత్‌రెడ్డి ఈ ఫ్యాక్టరీ విషయంపై తమకు హామీ ఇచ్చిన విషయాన్ని వినతిప్రతంలో ప్రస్తావించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఫ్యాక్టరీని దూరంగా తరలించాలని కోరారు. వినతిప్రతం ఇచ్చిన వారిలో చాంప్లా, ధరావత్ హుస్సేన్, సైదా, అస్రాం, ధరావత్ లింగయ్య తదితరులు ఉన్నారు.

కలెక్టరేట్‌లో సెమీ క్రిస్మస్ వేడుకలు


సెమీ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న అదనపు కలెక్టర్, అధికారులు

దురాజ్‌పల్లి : విశ్వాసంతో ముందుకెళ్లే వారికి దేవుడు ఎల్లప్పుడూ అండగా ఉంటాడని, బైబిల్ కూడా అదే బోధిస్తోందని అదనపు కలెక్టర్ సీహెచ్.ప్రియాంక అన్నారు. టీఎన్జీఓ జిల్లా అధ్యక్షుడు జానీమియా, కార్యదర్శి దున్న శ్యామ్‌తో కలిసి శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలోఎస్సీ అభివృద్ధి అధికారి దయానంద రాణి, కలెక్టరేట్ ఏఓ సుదర్శన్‌రెడ్డి, టీఎన్జీఓ నేతలు, జిల్లా అధికారులు పాల్గొన్నారు

ఘనంగా జాతీయ రైతు దినోత్సవం


రైతు దినోత్సవంలో పాల్గొన్న ఎస్‌బీఐ సిబ్బంది

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెంలోని భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్‌బీఐ)లో శుక్రవారం జాతీయ రైతు దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌బీఐ రైతులకు అమలు చేస్తున్న వివిధ పథకాల గురించి అధికారులు వివరించారు. రైతులకు 35 శాతం సబ్సిడీతో రూ. 10లక్షల వరకు రుణాలు అందిస్తున్నట్లు చెప్పారు. పంట రుణాలు తీసుకున్న రైతులు సకాలంలో చెల్లించి తిరిగి మళ్లీ రుణాలు పొందాలని కోరారు. ఈ సందర్భంగా కొంతమంది రైతులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీఐ మేనేజర్ బదావత్ రామకృష్ణ, సూర్యాపేట ఆర్‌బీఓ ఆర్‌ఎంఅర్‌యూ మేనేజర్ అనిల్, ఫీల్డ్ అధికారి వై.సురేంద్ర, పీఓ అక్షయ, బ్యాంక్ సిబ్బంది వెంకన్న, రమేష్, పృథ్వీరాజ్, నరేష్, రాజశేఖర్, విజయ్, వెంకటేష్, సోమేష్, రైతులు నాగరాజు, సత్యనారాయణరెడ్డి, సైదులు, జలేందర్, లింగమల్లు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు పెంపొందించాలి

నాగారం : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలను పెంపొందించాలని మండల నోడల్ అధికారి వాసం ప్రభాకర్ అన్నారు. శుక్రవారం పస్తాల ప్రాథమిక పాఠశాలలో తొలిమెట్టు (ఎఫ్ఎల్ఎన్) కార్యక్రమంలో భాగంగా తరగతి బోధనను పరిశీలించి మాట్లాడారు. ప్రతి విద్యార్థి తెలుగు, ఆంగ్ల భాషా, గణిత సామర్థ్యాలను సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ప్రతి విద్యార్థికి చదవడం, రాయడం, అక్షరాలను గుర్తించడం తప్పనిసరి చేయాలన్నారు. అనంతరం ఇప్పటివరకు జరిగిన ఎఫ్ఎల్ఎన్ ప్రగతి, అభ్యసన, ప్రీవియస్ పేపర్ల పరిశీలన, అసెస్‌మెంట్ తదితర అంశాలను సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు పగిళ్ల రమేష్, ఉపాధ్యాయులు రాము, శోభారాణి తదితరులు పాల్గొన్నారు.


పస్తాలలో తరగతి బోధనను పరిశీలిస్తున్న మండల నోడల్ అధికారి వాసం ప్రభాకర్

ఘనంగా జాతీయ గణిత దినోత్సవం


తిరుమలగిరిలో విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న ఉపాధ్యాయులు


తుంగతుర్తిలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు


పసునూర్ మోడల్‌స్కూల్‌లో కార్టిసియన్ జామెట్రీ ఆకారంలో కూర్చున్న విద్యార్థులు

తిరుమలగిరి : జాతీయ గణిత దినోత్సవాన్ని శుక్రవారం మండలంలోని వివిధ పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలంగాణ గణిత ఫోరం ఆధ్వర్యంలో విద్యార్థులకు టాలెంట్ టెస్ట్, వ్యాస రచన, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి ఐ.శాంతయ్య, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, మల్లయ్య, వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావు, అమ్జద్ పాల్గొన్నారు.

రామానుజన్ సేవలు మరువలేనివి

తుంగతుర్తి : మండలంలోని ఆయా పాఠశాలల్లో గణితశాస్త్ర పితామహుడు శ్రీనివాస రామానుజన్ జయంతి వేడుకలను, జాతీయ గణిత దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు రామానుజన్ చిత్రపటాలకు నివాళులర్పించారు. తుంగతుర్తి జెడ్పీహెచ్‌ఎస్‌లో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఆర్వీఆర్వీ పాఠశాలలో గణితం స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్వీఆర్వీ పాఠశాల ప్రిన్సిపల్ శ్యామలత, హెచ్‌ఎంలు కొండగడ్డుల యాకయ్య, పరమేష్, రమేష్, ఉపాధ్యాయులు భాస్కర్, సహదేవ్, హరికృష్ణ, కృష్ణవేణి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నాగారం : గణితశాస్త్ర పితామహుడు శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకొని మండల పరిధిలోని పసునూర్ మోడల్‌స్కూల్‌లో శుక్రవారం జాతీయ గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గణితశాస్త్ర ఉపాధ్యాయులు కావలి కార్తీక్, బందు కర్ణాకర్‌లు శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మోడల్‌స్కూల్‌లో విద్యార్థులు కార్టిసియన్ జ్యామితి ఆకారంలో కూర్చొని పలువురిని ఆకట్టుకున్నారు. పలు పాఠశాలల్లో విద్యార్థులకు గణితంలోని సూత్రాలపై, ముగ్గులు, పోస్టర్లు, 3డీ, 2డీ ఆకారాలు, లాజిక్స్ తదితర అంశాలపై పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మద్దిరాల : మండల పరిధిలోని ఆయా ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం గణిత శాస్త్ర పితామహుడు శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకోని జాతీయ గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గోరెంట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వివిధ పోటీలను నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రమేష్, గణిత శాస్త్ర ఉపాధ్యాయుడు శేఖర్, మనోహర్, కృష్ణవేణి పాల్గొన్నారు.


నూతనకల్ : శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

నూతనకల్ : పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు గణిత సామర్థ్యాలను పెంపొందించుకోవాలని ఎంఈఓ రాములు నాయక్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలు పాఠశాలల విద్యార్థులకు వివిధ రకాల పోటీలను నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత బస్సు సదుపాయం సవరించాలని వినతి


వినతిపత్రం అందజేస్తున్న డీఎస్పీ నాయకులు

నాగారం : రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మి పథకంలో మహిళలకు కల్పించిన ఉచిత బస్సు సదుపాయాన్ని సవరించాలని ధర్మ సమాజ్ పార్టీ(డీఎస్పీ) జిల్లా ప్రచార కమిటీ సభ్యుడు విజయరామరాజు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటి తహసీల్దార్ షాహిన్‌బేగంకు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ఆర్టీసీ బస్సుల్లో తెల్ల రేషన్‌కార్డు ఉన్న పేద మహిళలకు మాత్రమే ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. తెల్ల రేషన్‌కార్డు ఉన్న పేదలైన పురుషులకు కూడా ఉచిత ప్రయాణం కల్పించాలని కోరారు. ఆటో కార్మికులు జీవన భృతి కోల్పోయి తీవ్రంగా నష్టపోతున్నారని, ఆటో కార్మికులకు నెలకు రూ.3000 ఆర్థికసాయం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ మండల కమిటీ సభ్యులు నాగార్జున, పేరాల శ్రీనివాస్, శేఖర్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఓటమిని జీర్ణించుకోలేక అనుచిత వ్యాఖ్యలు


మాట్లాడుతున్న బొల్లెద్దు నాగయ్య

నూతనకల్ : ఎన్నికల్లో ఓటమిని జీర్ణించుకోలేక మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నాడని నియోజకవర్గ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు బొల్లెద్దు నాగయ్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. తుంగతుర్తి నియోజకవర్గంలో ఆరు నెలల్లో ఉప ఎన్నికలు వస్తాయని అనడం ఆయన అహంకారానికి నిదర్శనమన్నారు. ఇలాంటి మాటలు మళ్లీ పునరావృతమైతే నియోజకవర్గంలో తిరగనియ్యమని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు ఏర్పులకొండ సురేష్, ఇరుగు కిరణ్, బత్తుల నాగమల్లు, నకిరేకంటి మధుసూదన్, బత్తుల వెంకటనర్సు, దేశపంగు ఎల్లయ్య, కొమ్ము గణేష్, వీరయ్య, ఇరుగు శ్యామ్, దేషపంగు మురళి పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

మండల కమిటీ ఎన్నిక

పెన్‌పహాడ్ : తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ మండల కమిటీని శుక్రవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీహెచ్.రాములు తెలిపారు. మండల అధ్యక్షుడిగా మైలారపు వెంకన్న, ప్రధాన కార్యదర్శిగా బండ్ల రమేష్, ఉపాధ్యక్షులుగా కె.గోపి, ధనలక్ష్మి, కోశాధికారిగా వీరేంద్ర, కార్యదర్శులుగా రాంజీ, గోవింద్, వెంకటేశ్వర్లు ఎన్నికైనట్లు తెలిపారు.

మండల సర్వసభ్య సమావేశం వాయిదా

పెన్‌పహాడ్ : మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించాల్సిన సర్వసభ్య సమావేశాన్ని శనివారానికి వాయిదా వేసినట్లు ఎంపీడీఓ శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండల సర్వసభ్య సమావేశానికి 11మంది ఎంపీటీసీలకు గాను ఒక్క ఎంపీటీసీ మాత్రమే హాజరు కావడంతో వాయిదా వేసినట్లు తెలిపారు. ఈ సమావేశానికి ఎంపీపీ నెమ్మాది భిక్షం, జెడ్పీటీసీ మామిడి అనిత, అనంతారం గ్రామానికి చెందిన ఎంపీటీసీ మామిడి రేవతి, మండల కోఆప్షన్ ఎస్‌కే రఫీ హాజరయ్యారు.

బీఆర్ఎస్ క్రియాశీల సభ్యత్వానికి రాజీనామా

మద్దిరాల : బీఆర్ఎస్ అభివృద్ధికి ఎంత కష్టపడినా పార్టీలో ఎలాంటి గుర్తింపు లేకపోవడంతో మనస్తాపంతో ఆ పార్టీ క్రియాశీల సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు బీఆర్ఎస్ మండల నాయకుడు, ముకుందాపురం సర్పంచ్ అక్కిరెడ్డి జ్యోతి ఉపేందర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ముకుందాపురం గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. టీఆర్ఎస్ పార్టీ స్థాపితం నుంచి పార్టీ అభివృద్ధికి కృషి చేస్తే మధ్యలో వచ్చినవారు తమపై పెత్తనం చేస్తున్నారని తెలిపారు.

ఇసుక డంపులు వేలం

మద్దిరాల : జి.కొత్తపల్లి, ముకుందాపురం గ్రామాల్లో సీజ్ చేసిన అక్రమ ఇసుక డంపులకు శుక్రవారం రెవెన్యూ అధికారులు పోలీసుల సమక్షంలో వేలం నిర్వహించారు. 25ట్రిప్పుల ఇసుక డంపును పోలుమళ్లకు చెందిన గుంటూరు రవి రూ. 2,80,000లకు, 18 ట్రిప్పుల డంపును జి.కొత్తపల్లి గ్రామానికి చెందిన గంగవెల్లి రాంజేంద్రప్రసాద్ రూ.86,500లకు దక్కించుకున్నట్లు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వహీద్, సీనియర్ అసిస్టెంట్ రామారావు తెలిపారు.

ధనుర్మాస పూజలు


పూజలు చేస్తున్న భక్తులు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెంలోని శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలను భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఆరవ రోజు శుక్రవారం మహిళలు కుంకుమార్చన చేసి మంగళహారతులు ఇచ్చారు. అలాగే కీర్తనలతో స్వామిని స్మరించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు అర్వపల్లి రాంబాబుఅయ్యంగార్, పవన్‌కుమార్, గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.

అర్వపల్లికి చేరిన రాముడి తలంబ్రాలు

అర్వపల్లి : అయోధ్యలో రామాలయ ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకొని దేశవ్యాప్తంగా పంపిణీ చేస్తున్న రామజన్మభూమి అభియాన్ తీర్థ క్షేత్ర రాముడి అక్షింతలు శుక్రవారం సూర్యాపేట నుంచి అర్వపల్లికి చేరాయి. ఈ సందర్భంగా ధర్మజాగరణ సభ సభ్యురాలు బొడ్డు అరుణ మాట్లాడారు. ఆదివారం అర్వపల్లిలోని శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో ఈ అక్షింతలను మండలంలోని 17 గ్రామ పంచాయతీలకు 17 కళశాలలో పంపిస్తామని చెప్పారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఐదుగురు కమిటీ సభ్యులు ఆలయానికి వచ్చి పూజలు చేసి అక్షింతలు తీసుకొని వెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో అర్చకులు రాంబాబుఅయ్యంగార్, పవన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

బడి బయటి పిల్లల గుర్తింపు

నాగారం : వర్ధమానుకోట, ఈటూరు గ్రామాల్లో బడి బయట ఉండే పిల్లలను గుర్తించేందుకు క్లస్టర్ సీఆర్పీలు శుక్రవారం ఇంటింటి సర్వే నిర్వహించారు. పిల్లల వివరాలను ప్రబంద్ పోర్టల్‌లో నమోదు చేశారు. కార్యక్రమంలో సీఆర్పీలు హరిప్రసాద్, స్వామిగౌడ్, హెచ్ఎం చక్రధర్ పాల్గొన్నారు.


సర్వే చేస్తున్న సీఆర్పీ హరిప్రసాద్